క్లుప్తంగా

ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా కోట రమేష్



ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని విలేకర్లు ఆదివారం నిర్వహించిన సమావేశంలో తాడ్వాయి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా కోట రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ.. మండంలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల సమన్వయంతో వారి అభిప్రాయాల మేరకు పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు బండారి లక్ష్మణ్, కొగిల సారయ్య, చలగొండ శ్రీకాంత్, చింతల దేవేందర్, తమ్మళ సమ్మయ్య, తిరువాయిడి పురుషోత్తం, వినయకారావు, చింతల సంపత్ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



ములుగు రూరల్: మండలంలోని ఇంచర్ల శివారులోని అంబేడ్కర్ నగర్‌లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలకు బీఆర్ఎస్ పార్టీ నాయకుడు భూక్య దేవ్‌సింగ్ దుప్పట్లను పంపిణీ చేశారు. చలితీవ్రత ఎక్కువగా ఉండడంతో మహిళలకు ఆదివారం చలిదుప్పట్లను, జూట్ బ్యాగులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ములుగు జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుకోవలసిన బాధ్యత మనపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర నాయకుడు పోరిక రాహుల్‌నాయక్, రాజ్‌కుమార్, పోరిక కిషోర్, నర్సయ్య, సమ్మయ్య, జగదీష్, రేష్మ, కుమార్స్వామి, సర్వర్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసు తనిఖీలు



వెంకటపురం(కె): మండలంలోకి వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న నూతన వ్యక్తులపై స్థానిక పోలీసులు ప్రత్యేక నిఘా పెంచారు. ఆదివారం ఎస్సై అశోక్ సిబ్బందితో కలిసి ఆలుబాక ఏకన్నగూడెం మధ్య ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. మండలం నుంచి భద్రచలం వివిధ ప్రాంతాలకు రవాణా నిత్యం కొనసాగుతుండడంతో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ నుంచి అనుమానిత వ్యక్తులు వస్తున్నట్లు సమాచారం మేరకు తనిఖీలు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవం



భూపాలపల్లి రూరల్: ధర్మ సమాజ్‌పార్టీ వ్యవస్థాపకుడు విశారదన్ మహారాజ్ చేసినటువంటి పదివేల కిలోమీటర్ల పాదయాత్రలో భాగంగా జిల్లా కేంద్రంలో గత సంవత్సరం డిసెంబర్ 24న పాదయాత్రకి గుర్తుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నేటికి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ నాయకులు కొత్తూరి రవీందర్ మహారాజ్ ఆధ్వర్యంలో మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదిగ జాగృతి సంఘం కన్వీనర్ జగన్, కో కన్వీనర్, రాజేష్, పుల్యాల తిరుపతి, ధర్మసమాజ్ పార్టీ నాయకులు రవీందర్, హరీష్, మహర్షి, దశరథం, అశోక్, శేఖ, రాజేష్, చందన్, జగపతి, సందీప్, శ్రావణ్, సురేష్, బన్నీ, సందీప్, అశోక్, మహేందర్ పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

పరకాల : పరకాల పట్టణంలో మినీ క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు సంబురంగా నిర్వహించారు. పట్టణంలోని చర్చిలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. కేక్ కటింగ్‌లతో ముందుస్తు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అదే విధంగా సేవ సంస్థల ఆధ్వర్యంలో నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. పరకాల పట్టణంలోని నిరుపేదలకు ప్రేమ కరుణ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆదివారం 2వ వార్డులోని చర్చి ఆవరణంలో 100 మంది నిరుపేదలకు చీరలు, దుప్పట్లను ఆ సంస్థ నిర్వాహకుడు దిలీప్ చేతుల మీదుగా అందజేశారు. 1వ వార్డులోని షారోన్ మందిరంలో పాస్టర్ దయాకర్, గూడెల్లి రేచల్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ వేడుకలకు కౌన్సిలర్ సంపత్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రేమ కరుణ సంస్థ నిర్వాహకుడు దిలీప్ పదేళ్లుగా పేద కుటుంబాలకు వితంతువులకు, దివ్యాంగులకు, వృద్ధులకు సేవా దృక్పథంతో ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

నెట్ సమస్య తీరేదెన్నడో?

- జీఎస్ఎన్ఎల్ టవర్ ఒకటే దిక్కు
- నిర్లక్ష్యంగా సెల్ టవర్ల నిర్మాణ పనులు
- పట్టించుకోని అధికారులు



చింతగూడెంలో నిర్మాణంలో ఉన్న టవర్



చింతగూడెం వద్ద నిర్మాణంలో ఉన్న సోలార్ స్టాండ్

కన్నాయిగూడెం : ఏజెన్సీ మండలంలో ఇంటర్నెట్ సమస్య వినియోగదారులను వేధిస్తోంది. బీఎస్ఎన్ఎల్ టవర్ ఒక్కటే ఉండడంతో సిగ్నల్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కరెంట్ పోయిందంటే ఫోన్ మాట్లాడుతుంటే మధ్యలోనే కాల్ బంద్ అవుతోంది. ప్రత్యామ్నాయంగా బ్యాటరీ లేదా జనరేటర్ ఏర్పాటు చేయాలి. కానీ బీఎస్ఎన్ఎల్ అధికారులు వాటిపై దృష్టి సారించకపోవడంతో మండల ప్రజలకు సిగ్నల్ సమస్య తప్పడంలేదు.

కొత్తగా మరో 5 టవర్లు నిర్మాణం

మండలంలో 11గ్రామ పంచాయతీ కార్యాలయాలు ఉండగా అన్ని గ్రామాల్లో సిగ్నల్ సమస్యలు వేధిస్తున్నాయి. సిగ్నల్ సమస్యలు తొలగించాలనే ఉద్దేశంతో మండలంలో చింతగూడెం, కంతనపల్లి, ఐలాపూర్, భూపతిపురం గ్రామాల్లో కొత్తగా సెల్ టవర్ల నిర్మాణాన్ని చేపట్టారు. పనులు దక్కించుకున్న గుత్తేదారులు గతేడాది పనులు మొదలుపెట్టాడు. ఇప్పటికీ పనులు పూర్తి చేయక నిర్లక్ష్యంతో పనులు నత్తనడక సాగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో కొంతమేరా పూర్తి కావొచ్చిన మిగతా గ్రామాల్లో మాత్రం పనులు ముందుసాగడం లేదు. అధికారులు వాటిపై దృష్టిపెట్టడం లేదని, దీంతో పనులు మధ్యలో వదిలేశారని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు

రేషన్, పెన్షన్ దరఖాస్తులకు తిప్పలు

కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్ కార్డుల జారీకి దరఖాస్తు, పించన్ మంజూరుకు అప్లికేషన్ ఫామ్‌ల కోసం ఇంటర్ నెట్ తప్పనిసరి. కాగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు మీసేవ, ఆన్‌లైన్ సెంటర్లకు వెళ్లాల్సిందే. దీంతో నిత్యం సిగ్నల్ సమస్యతో అవస్థలు పడుతున్న ప్రజలకు మళ్లీ ఇంటర్‌నెట్ సిగ్నల్ తిప్పలు తప్పవని ఆందోళన చెందుతున్నారు. పక్క మండలానికి వెళ్లాలంటే అదనంగా చార్జీలతో పాటు సమయం కూడా వృథా అవుతుందని చెబుతున్నారు. ఇక్కడే ఇంటర్నెట్ ఉంటే సులువుగా దరఖాస్తు చేసుకోవచ్చని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా మండల ప్రజలకు ఇంటర్నెట్ సమస్యలు తొలగాలంటే ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే గాని పరిష్కారం కావని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

> **ఇబ్బంది పడుతున్నాం..**
>
> మండలంలో ఇంటర్నెట్ సిగ్నల్ రాక చాలా ఇబ్బందిగా ఉన్నాయి. ఎప్పుడు సిగ్నల్ ఉంటుందో..ఎప్పుడు పోతుందో ఎవరికి తెల్వది. సిగ్నల్ పోయినప్పుడు ఎవరిని అడగాలో తెలియదు. సర్టిఫికెట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మీసేవకు వెళ్లిన అక్కడా ఎప్పుడు నెట్ ఉంటుందో లేదో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణంలో ఉన్న సెల్ టవర్లను పూర్తి చేయాలి. సమస్యలను పరిష్కరించాలి.
>
> -దుర్గం రాజేష్, చింతగూడెం

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్



మొగుళ్లపల్లి: పరామర్శిస్తున్న వెంకటరమణారెడ్డి

ములుగు రూరల్: మండలంలోని ఇంచర్ల, పత్తిపల్లి గ్రామ పంచాయతీ చింతలపల్లి గ్రామాలకు చెందిన మాస్కుల అశోక్, మామిడిపల్లి భిక్షపతి ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ ఆదివారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చింతలపల్లి గ్రామానికి చెందిన భిక్షపతికి ముగ్గరు సంతానమని ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడం బాధాకరమని అన్నారు. పిల్లల భవిష్యత్‌కు సర్వర్ చారిటబుల్ ట్రస్టు అండగా ఉంటుందని అన్నారు. ఆమె వెంట ట్రస్టు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు .

నాయకుల పరామర్శ

మండలంలోని పెగడపల్లి, కొత్తూరు గ్రామాలకు చెందిన మందపల్లి లక్ష్మి, తవిటి ముత్తారావులు అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాలను కాంగ్రెస్ జిల్లా నాయకుడు ప్రవీణ్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. మృత దేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు రూ.2 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట బండి మధు, అశోక్, అనిల్, ప్రవీణ్, సుధాకర్, శేఖర్, రవి, రవీందర్‌రావు, సమ్మిరెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రానికి చెందిన ఎల్లండి సదానందం, మంగళపెల్లి లచ్చమ్మ చింతలపల్లి గ్రామానికి చెందిన లడె రాజీరు, లచ్చమ్మ, ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను ఆదివారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగహారావు, కోడారి రమేష్, బాపురావు, నర్సింహారెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



పెద్దంపల్లిలో ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

టేకుమట్ల: మండలంలోని ఎంపేడు గ్రామానికి చెందిన మ్యాడగోని శ్రావణ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి, కోటగిరి సతీష్‌గౌడ్ పరామర్శించి రూ.21వేల ఆర్థిక సాయంతో పాటు బియ్యాన్ని అందించారు. మాజీ వైస్ ఎంపీపీ సట్ల కొమురయ్య, నాయకులు ఇసంపెల్లి పోశాలు, నేరేళ్ళ తిరుపతి, రమేష్, మొగిళి, వెంకటేష్, విష్ణు, మల్లేష్, తదితరులు ఉన్నారు.

పెద్దంపల్లిలో..

మండలంలోని ఎంపేడు గ్రామానికి చెందిన బొల్లికొండ ఆకాశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులను ఆదివారం టాటా ఏస్, జీప్ అసోసియేషన్ జిల్లా, మండల శాఖ సభ్యులు పరామర్శించి రూ.18వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, టాటా ఏస్, జీప్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెసరు రాజేష్, గౌరవ అధ్యక్షుడు గునిగంటి మహేందర్, మండల అధ్యక్షుడు జంగ మధూకర్, రాజు, చందు, వెంకటేష్, హరీష్ పాల్గొన్నారు.

మూడు ఇళ్లలో చోరీ



ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శాఖాన్

- రూ.2.25 లక్షలు అపహరణ

చిట్యాల: మండలంలోని ఒడితల గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కందుకూరి వెంకటయ్య, ఏరుకొండ శంకర్ ఇళ్లలోకి ముందుగా దుండగులు చొరబడి తాళాలను పగలగొట్టి ఇళ్లలో వెతకగా ఏమి లభించలేదు. దీంతో పక్కనే ఉన్న నేరేళ్ల సారంగాపాణి ఇంటి వెనుక తలుపులను పగలకొట్టి ఇంట్లోని రూ.2 లక్షల 25వేలు అపహరించినట్లు తెలిపారు. సారంగాపాణి తన కుటుంబ సభ్యులతో కలిసి గత మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని కూతురు ఇంటికి వెళ్లారు. దీంతో ఇంటిలో ఎవరు లేని సమయంలో దుండగులు తాళాలను పగలగోట్టి చోరీకి పాల్పడ్డారు. కాగా, ఇంట్లో రెండు లక్షల ఇరవై ఐదు వేల రూపాయాలు, అలాగే నెల రోజుల క్రితం కూతురుకు పెళ్లి చేసిన సమయంలో కొనుగోలు చేసిన 35 తులాల బంగారం కిరాణంలోని డ్రాలో కవరులో పెట్టినట్లు బాధితుడు తెలిపాడు. ఈ విషయం గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక ఎస్సై 2 ఎండీ శాఖాన్ సిబ్బందితో సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. కిరాణం షాపు తలుపులు తీసి ఉండగా కోతుల గుంపు ఇంటిలోకి చొరబడి ఇంటిలోని వస్తువులను చెల్లాచెదురుగా చేశాయన్నారు. కిరాణం షాపు డ్రాలో పెట్టిన 35 తులాల బంగారం కవర్‌ను కోతులు అక్కడక్కడ పడేయడంతో బంగారం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. దీంతో అతని కుటుంబ సభ్యులకు బంగారు అభరణాలను అందజేశామన్నారు. కాగా, 35 తులాల బంగారానికి 30 తులాలు ఉందని బాధితుడు తెలిపాడు. సంఘటన స్థలానికి క్లూస్‌టీమ్ సీఐ రాజ్ కుమార్, కానిస్టేబుల్ కుమార్‌లు వచ్చి వేలి ముద్రలను సేకరించారు. ఈ విషయంపై ఎస్సైని వివరణ కోరగా బాధితుడు అందుబాటులో లేడని అతడు వచ్చిన వెంటనే ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తామని తెలిపారు.

అయ్యప్ప మహా పడిపూజ



పడి ముట్టిస్తున్న శివకుమార్

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన ఆకుల శివకుమార్ గురుస్వామి కుటీరంలో ఆదివారం అయ్యప్ప మహా పడిపూజను గురుస్వామి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పడిని అలంకరించి గణపతి, లక్ష్మిదేవి, అయ్యప్పస్వామి పటాలకు అలంకరించి అష్టోత్తరాలు, శరణుఘోషతో వేద మంత్రాల మధ్య అయ్యప్పకు అభిషేకం నిర్వహించారు. అయ్యప్ప భక్తుల శరణు నామస్మరణ భజనలతో మార్మోగించారు. గురుస్వామి శివకుమార్ పడిని ముట్టించారు. అనంతరం అనంతరం అయ్యప్ప భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామల భిక్షపతి, పసునూటి భిక్షపతి, సామల రవీందర్, నామని శివ, స్కైలాబ్, వివిధ గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు సంబంధిత కాంట్రాక్టర్ పరిహారం చెల్లించాలని లేనిచో తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రానికి చెందిన బాధితులు స్థానిక సర్పంచ్ పర్వతగిరి రాజు ఆధ్వర్యంలో హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిని కలిసి సన్మానించారు. అలాగే బాధితులు మాట్లాడుతూ.. తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిని కోరగా వెంటనే స్పందించి పీఆర్ డీఈ లింగారెడ్డికి ఫోన్ చేసి అందరికీ పరిహారం రూ.5లక్షలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కుమారస్వామి ఉన్నారు.

బియ్యం పంపిణీ



బియ్యం అందజేస్తున్న నాయకులు

శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారం గ్రామానికి చెందిన లోకలబోయిన కుమారస్వామి ఇటీవల మృతి చెందాడు. కాగా ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి క్వింటా బియ్యం అందజేశారు. ఉప సర్పంచ్ మోరె శ్రీనివాస్, నాయకులు కేసరి కట్టయ్య, మోరె రాజయ్య పాల్గొన్నారు.

సర్టిఫికెట్ అందజేత



రిత్వికకు సర్టిఫికెట్ అందజేస్తున్న మంజుల

శాయంపేట : సాగంటి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన విద్యార్థి మారెపల్లి రిత్విక పాల్గొన్నారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ మంజుల పర్యావరణ విభాగంలో రిత్వికకు సర్టిఫికెట్‌ను అందజేశారు. రిత్విక ప్రస్తుతం ఆత్మకూరు మండలం తిరుమలగిరి కస్తూర్బాగాంధీ పాఠశాలలో పదోతరగతి చదువుతుంది.

ధ్వంసమైన రహదారి

- కంకర లారీలతో దెబ్బతిన్న జంగాలపల్లి రోడ్డు
- మరమ్మతులు చేపట్టాలంటున్న ప్రజలు



ధ్వంసమైన రోడ్డు

వాజేడు: ఒక రోడ్డు వేయడం కోసం మరో రోడ్డుపై నుంచి పనులను నిర్వహించడంతో ఆ రోడ్డు ధ్వంసమైంది. మండల పరిధిలోని జంగాలపల్లి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. నాగారం నుంచి గుమ్మడిదొడ్డి గ్రామానికి వెళ్లే రహదారిలో గాజుల ఒర్రె వద్ద హైలెవెల్ వంతెనను నిర్మించారు. వంతెనకు రెండు వైపుల మొరం (కంకర) పోయాల్సి ఉంది. దానికి గాను కుమ్మరి కుంట సమీపం నుంచి కంకర తరలిస్తున్నారు. ఆ కంకరను జంగాలపల్లికి వెళ్లే బీటీ రోడ్డుపై నుంచి లారీలతో తీసుకెళ్తున్నారు. దీంతో బీటీ రోడ్డుపై నుంచి కంకర లోడు లారీలు రావడంతో రహదారి ధ్వంసమైంది. ప్రతీ రోజు ఉదయం నుంచి రాత్రి వరకు ఈ రహదారిపై వందలాది వాహనాలు నడుస్తుంటాయి. వ్యవసాయ పనులకు వెళ్లే వారు, ఇతర పనుల నిమిత్తం వెళ్లే వారు ఎక్కువగా ప్రయణిస్తుంటారు. రోడ్డు మొత్తం గుంతలమయం కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సదరు క్రాంట్రాక్టర్ వెంటనే రహదారి మరమ్మతు చేయించాలని మండల వాసులు కోరుతున్నారు.

ఘనంగా ‘ట్రస్మా’ క్రీడలు ప్రారంభం



జాతీయ జెండా ఆవిష్కరించి క్రీడలను ప్రారంభిస్తున్న సర్పంచ్ అశోక్



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని వేద వ్యాస ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ప్రైవేటు పాఠశాలల (ట్రస్మా) క్రీడోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సర్పంచ్ మేడబోయిన అశోక్ జాతీయ జెండాను ఆవిష్కరించి క్రీడలను ప్రారంభించారు. జిల్లాలోని 30 ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్రీడోత్సవాలలో పాల్గొన్నట్లు ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పోశాల వీరమల్లు, క్రీడల కన్వీనర్ అంబటి కోటిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా నాయకులు దుగ్గిరెడ్డి సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, అమరావతి రాజయ్య, కందాల రమేష్, లబర్తి శ్రీనివాస్‌రెడ్డి, జలగం మోహన్‌రావు, రాజేందర్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మహాముత్తారం: వికసిత భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా మండలంలోని బోర్లగూడెం, పెగడపల్లి గ్రామాల్లో ఆదివారం డిజిటల్ వీడియో ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం మహాముత్తారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సంతోష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధికల్పన కోసం కేంద్రప్రభుత్వం అనేక రకాలైన రుణాలను అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యశాఖ శాస్త్రవేత్త సాయికిరణ్, అగ్రికల్చర్ ఏఈఓ ఆస్మా, టీజీబి ఎఫ్ఓ రోహన్, ఎఫ్‌సీఎల్ కౌన్సిలర్ బాలకృష్ణ, రాజేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్తమ మహిళా ఉద్యోగుల ఎంపిక

మల్హర్: ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ శాఖలకు చెందిన 20 మంది ఉత్తమ మహిళా ఉద్యోగులను ఎంపిక చేసినట్లు జాతీయ మానవ హక్కుల మండలి మండల అధ్యక్షుడు చింతలపల్లి కుమార్‌యాదవ్, ఉపాధ్యక్షుడు బండి సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆల్ ఎంప్లాయిస్ సొసైటీ జాతీయ అధ్యక్షురాలు వేముల జ్యోతి, రాష్ట్ర అధ్యక్షుడు లింగపల్లి శంకర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి ఆదేశాల మేరకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కొయ్యూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు సుధారాణి, రోజ, సౌజన్య, శిరీష, రమాదేవి, వ్యవసాయ శాఖ నుంచి శిరీష, మనీషా, అనూష, ఐసీడీఎస్ నుంచి పద్మ, అన్నపూర్ణ, రమాదేవి, పంచాయతీ కార్యదర్శులు సరిత, వెన్నల, సునీత, ఆరోగ్యశాఖ నుంచి సరిత, సాధన, రాజేశ్వరి, ఫారెస్ట్ నుంచి వనజ, పద్మ, పారిశుద్ధ్య కార్మికులు అక్కపాక ఓదెమ్మలను ఉత్తమ మహిళ ఉద్యోగులుగా ఎంపిక చేసినట్లు తెలియజేశారు. జనవరి 3న సావిత్రీబాయి పూలే జయంతి పురష్కరించుకొని పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమర్ చంద్ కల్యాణ మండపం జెండా చౌరస్తాలో వారికి ప్రశంస పత్రాలు, మెంమోటలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

పంటకు చీర రక్షణ



పంట చుట్టూ కట్టిన చీరలు

మహాముత్తారం: రైతులు ఆరుగాలం పలురకాల పంటలను సాగు చేసుకుంటే తీరా పంట చేతికచ్చే దిశలో అడవి పందులు ధ్వంసం చేస్తున్నాయి. పందులు, దుప్పులు లాంటి అడవిజంతువులు దాడిచేసి చేతికచ్చే పంటలను నాశనం చేస్తున్నాయి. అడవులు తరించుకుపోవడంవలన జంతువులు గ్రామాల్లోని పంటలపై పడి నాశనం చేస్తున్నట్లు కొంతమంది రైతులు వాపోతున్నారు. మండలంలోని అటవీ గ్రామాలైన కనుకునూర్, రెడ్డిపల్లి, సింగారం, బోర్లగూడెం, యత్నారం, నిమ్మగూడెం , జీలపల్లి, పోలారం,దుంపిల్లపల్లి, గండికామారం, కోనంపేట తదితర గ్రామాల్లో యాసంగి సీజన్‌ల్ ఎక్కువగా పల్లి, పెసర, బబ్బెర, మినుములు, తదితర ఆరుతడి పంటలు సాగుచేస్తుంటారు. చేతికచ్చిన పంటలను అడవిజంతువులు నాశనం చేస్తున్నాయని ఆయ గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు పంటల చుట్టూ కర్రలు పాతి రంగు రంగుల చీరలను కంచేలాగా కడుతున్నారు. అడవిపందులు రాత్రి సమయాల్లో దాడిచేసేటప్పుడు ఆ చీరల స్పర్శతో మనుషులు ఉన్నట్లుగా భ్రమపడి వెళ్లిపోతాయాని వారు తెలుపుతున్నారు.